

# నలభై రూపాయలు

నవంబర్ 1969

శ్రీసుబ్బకవిగారికి,

ఆర్యా,

చింతపండు, బెల్లం మరియు ఆముదం వ్యాపారుల జిడ్డు హస్తముల బారి నుండి సాహిత్య సరస్వతిని రక్షించి, పుస్తకములను పిల్లకాయలకు చవకగా అందజేయు మహత్ లక్ష్యముతో పాఠ్య గ్రంథములను ప్రభుత్వ పక్షాన మేమే ముద్రించి, అమ్మించదలచి యుండుట తమకు విదితమే.

ఈ మహత్ ప్రణాళికలో భాగముగా ఈ ఏడాది ఒకటో క్లాసు పిల్లకాయల ఉపయోగార్థం ఎక్కాల పుస్తకం ప్రచురింప నిశ్చయింపనైనది.

కవిగా తమకుగల తిరుపతి కొండంత ఖ్యాతిని, అధ్యాపకులుగా మీకు గల బంగాళాఖాత మంత అనుభవమును గుర్తించి, ఈ ఎక్కాల పుస్తకమునకు తమరిని రచయితగా ఎన్నిక చేయనైనది.

ఫలానా ఊరి, ఫలానా కాలేజీ లెక్కల డిపార్టుమెంటు హెడ్డుగారయిన శ్రీగుణింతానంద గారిని ఎడిటర్‌గానూ, సుప్రసిద్ధ చిత్రకారులు శ్రీ కాపీ దాసు గారిని ఆర్టిస్టుగానూ ఈ గ్రంథ రాజమునకు మీతోపాటు ఎన్నిక చేయనైనది.

'ముగ్గురు మరాఠీలు' వలెగాక, త్రిమూర్తులవోలె మీరు ముగ్గురూ కలిసి ఈ ఒకటో క్లాసు ఎక్కాల పుస్తకమును నభూతో నభవిష్యతిగా తీర్చిదిద్ది మాకు మూడు మాసములలోగా అందించి, మేమిచ్చు పారితోషికమును అందుకొని, అప్పులుగానీ, వాటి వడ్డీలుగానీ తీర్చుకుని ఆనందించగలరని నమ్ముచున్నాము.

మేమిచ్చు పారితోషిక, ప్రయాణభత్యాది వివరములుగల అగ్రిమెంటు నొకదానికి ఇందుతో జతపరచుచున్నాము. ఈ షరతులను, నియామకమును ఆమోదించుచూ అర్జంటుగా సంతకం చేసి తక్షణమే త్రిప్పి పంపగలరని విశ్వసించుచున్నాము.

☆

జనవరి 1970

ఘనమైన ఏలినవారికి,

సుబ్బకవి నమస్కార శతములు. తాము గత నవంబరులో వ్రాసి డిశంబరు ఆఖరు వారంలో పోస్టుచేసిన అమూల్య లేఖను ఈ రోజే అందుకొని ధన్యుడనైతిని.

కవిగా నా ఘనతను గుర్తించి, ఒకటో క్లాసు ఎక్కాల పుస్తకమునకు నన్ను రచయితగా నియమించిన మీ విజ్ఞతకు ఇవే నా జోహార్లు. నా కవితా ప్రతిభతో మీ ఎక్కాల పుస్తక మును కాళిదాసాదులు సైతం పదేపదే చదివి ఆనందించగల రీతిలో రూపొందించగలనని నా సిరాబుడ్డి సాక్షిగా హామీ ఇచ్చుచున్నాను.

అగ్రిమెంటును సంతకములతోసహా త్రిప్పిపంపుచూ, తమరి తదుపరి ఆజ్ఞలకై ఎదురు చూడగలను. దయచేసి మున్ముందు తమరి ఆఫీసు ఉత్తరములు త్వరత్వరగా పోస్టగునట్లు చూడ ప్రార్థన.

☆

మార్చి 1970

శ్రీసుబ్బకవి గారికి,

మీరు రచయితగానున్నట్టి ఒకటో క్లాసు ఎక్కాల పుస్తకం కమిటీ మీటింగు మార్చి 15వ తేదీన ఎడిటరు గారైన శ్రీ గుణింతానందగారి కాలేజీలో ఏర్పాటు చేయటమైనది. కనుక మీరు మీ కలం, సిరాబుడ్డి, కళ్ళజోడు ఇత్యాది పరికరములతోసహా ఆ తేదీన ఆ మీటిం గుకు హాజరై, ఎడిటరుగారి సూచనలందుకుని ఆ ప్రకారము మీ రచన పూర్తిచేయగలరు. శ్రీకాపీదాసు గారున్నూ ఈ సమావేశమునకు హాజరు కావలసినదిగా ఆదేశింపబడియున్నా రు. కాన మీరు ఈ అవకాశము నుపయోగించుకొని వారితో "ఎక్కములు-కళాత్మకత" గురించి చర్చించి, శ్రీకాపీదాసుగారికి మన ఎక్కాల పుస్తకం గెటప్ గురించి తగు సూచన లివ్వగలరని నమ్ముచున్నాము.

☆

ఏప్రిల్ 1970

ఘనమైన ఏలినవారికి,

సుబ్బకవి విన్నపములు. తాము మార్చి 6న వ్రాసి 12న పోస్టు చేసిన మీటింగు నోటీసు సకాలముననే మా ఊరికి చేరియున్నది.

కాని, తాము బహుశా పనివత్తిడిలో ఉండి గావచ్చును. కవరుపై స్టాంపులు అతికించుట మరచి పోస్టు చేయుటచే బేరింగుతో అది నాకు అందజేయబడినది. ఏలినవారు చిత్తగించ వలెను; అప్పటికే నేను వారం దినములుగా ముక్కు పొడుముకు పాతిక పైసలు కూడా లేక ఘోర దురవస్థలో యుంటిని. పైగా మా ఊరి పచారిషాపు ఓనరు సుబ్బిశెట్టి వలెనే మా పోస్టు బంట్రోతు కూడా కవుల గొప్పదనము తెలీని అజ్ఞాని యగుటచే వాడు నాకు అప్పుపెట్టుటకు నిరాకరించియుండెను. ఇట్టి స్థితిలో నేను వారం దినములు నిస్సహాయుడ నుగా ఉండిపోతిని.

ఈ రోజే మా జిల్లా పరిషత్ పెద్దలు మమ్మనుగ్రహించి మూడు నెలల జీతములివ్వగా, అందులో అతి కష్టముమీద అప్పులు పోను నలభై పైసలు మిగిల్చి తమరి అమూల్య లేఖను విడిపించుకునియుంటిని.

మహో ప్రభో, మార్చి 15 ఎలాగూ వెళ్ళిపోయినది. కనుక తాము ఈ ఏప్రిల్ 15న

కమిటీ మీటింగు ఏర్పాటు చేసినచో నేను శ్రీ గుణితానందుల వారి సమ్ముఖమున హాజరు కాగలవాడను. దయచేసి ఏప్రిల్ 15న మీటింగు ఏర్పాటుచేసి నాకు ప్రయాణఖర్చుల నిమిత్తం అక్షరాలా ఏబది రూపాయలు టి.ఏ. అడ్వాన్సుగా పంప ప్రార్థించుచున్నాను. చిత్త గించవలెను.

☆

జూన్ 1970

శ్రీ సుబ్బకవి గారికి

మీ లేఖ అందుకొనడమైనది. మీ కమిటీ మీటింగును జూలై 15 సాయంత్రం 4 గంట లకు ఎడిటరుగారైన శ్రీ గుణింతానందుల వారి అత్తవారి ఊరిలోగల హైస్కూలు వరం డాలో ఏర్పాటుచేయనైనది. ఈ మీటింగు మూడు రోజులపాటు జరగగలదు. శ్రీగుణితానం దులవారి మామగారు జబ్బు నుండి కోలుకొనుట ఆలస్యమగుచో మీటింగు మరి మూడు రోజులపాటు పొడిగించబడగలదు.

ఈ మీటింగులో ఒకటో క్లాసు ఎక్కాల పుస్తకమునకు సంబంధించిన నమస్తాంశములపై అంతిమ నిర్ణయములు తీసుకోబడగలవు. కనుక మీరు తప్పనిసరిగా మీ సిరాబుడ్డి వగైరా లతో హాజరు కాగలరు. లేనిపక్షములో మీ నియామకము రద్దుచేయబడగలదు.

టి.ఏ అడ్వాన్సుకై మీ విజ్ఞప్తిని పరిశీలించడమైనది. మీరు మా ఆఫీసులో పనిచేయు వారు కారు, గాన, మీకు అడ్వాన్సు లిచ్చుటకు మా రూల్సు అంగీకరించవు. మీరు అడ్వాన్సు పుచ్చుకుని మీటింగుకు, రాక మీ ఊరిపచారి షాపుకేగి అప్పులు తీర్చుకుని, నశ్యండబ్బీ నింపు కుని, నల్లమందు వేసుకుని నిద్రపోయినచో మేమేమి చేయగలము? మా ఎక్కాల పుస్తకం గతి ఏమి కావలెను?

కనుక, మీరు మీ సిరాబుడ్డిని గానీ, కళ్ళజోడునుగాని తాకట్టుపెట్టి అయినా సరే మీటిం గుకు మాత్రం హాజరు గావలసినది. మీటింగు నుండి తిరిగి వచ్చిన తదుపరి మీ టి.ఏ. బిల్లు పంపినచో మేము వీలైనంత త్వరగా దానిని ప్యాసు చేసి చెక్కు పంపగలము. అది అందుకుని మీరు నస్యం కొనుక్కున్నా, నల్లమందు వేసుకున్నా మాకు అభ్యంతరం లేదు. గ్రహించగలరు.

☆

జూలై 1970

ఘనమైన ఏలినవారికి,

సుబ్బకవి వందనములు! తమరి మీటింగు నోటీసు అందుకొని ఆనందించించితిని. టి.ఏ అడ్వాన్సు గురించి తమరు సెలవిచ్చినది చదివి విచారించితిని. ప్రభువులు ఆగ్రహించినచో మేము మనగలమా?

ప్రభో! జీతములు సరిగా రాక, డబ్బీలో ఒక్క పిసరు నశ్యమయిననూ నిలువ లేక యమ బాధ పడుచున్న నాకు కమిటీ మీటింగుకు హాజరుగుటకు రైలు ఖర్చులెట్లు దొరుకును? మా యీ దౌర్భాగ్యపు టూరిలో ఒక్క భోజుడైననూ, ఒక్క శ్రీకృష్ణదేవరాయడైననూ లేడు గదా! ఆహా! కవులకెట్టి గడ్డురోజులెదురయ్యెను!

చేయునది లేక చివరకు మా ఊరి కుబేరుడు సుబ్బిశెట్టి వద్దకేగి ఒక పూటంతా కష్టపడి వాడి కుటుంబీకులందరిమీదా పంచరత్నములు ఫ్రీగా చదివి, వ్రాసిచ్చి, నెలకు నూటికి పన్నెండు రూపాయల వడ్డీకి అక్షరాలా ఏబది రూపాయలు సాధించుకుని, అందులో పది

రూపాయలు గుండె జబ్బుతో మంచాన పడి ఉన్న మా నాయనగారి మందులకని ఇచ్చి నేను మీటింగుకు హాజరయి ఉంటిని.

మన ఎడిటరు శ్రీగుణింతానందుల వారి మామగారు త్వరగానే కోలుకున్నందున మీటింగు మూడు రోజులలోనే పూర్తయినది. తిరుగు ప్రయాణములో రైలులోనే మన ఒక టోక్లాసు ఎక్కాల పుస్తకమును నేను విరచించి వేసితిని. నాకిది యొక లెక్కలోనిదా!

ఎక్కాల పుస్తకం వ్రాతపతిని, టి.ఏ. బిల్లును ఇందుతో పంపుచున్నాను. దయచేసి నా టి.ఎ. బిల్లు 40 రూపాయల మూడు పైసలున్నూ, ఎక్కాల పుస్తకం పారితోషికమున్నూ వెంటనే పంపే ఏర్పాటు చేయగలరని నమ్ముచున్నాను.

అయ్యా,

మరొక మనవి ఏమనగా, మహాకవినైన నేను, మహాపండితులైన శ్రీ గుణింతానందుల వారూ, మహాచిత్రకారులైన శ్రీ కాపీదాసుల వారూ కలసి రూపొందించిన ఈ మహద్గ్రంథ మునకు "ఎక్కాల పుస్తకం" అని పేరిడుట భావ్యముగా లేదని కమిటీ మీటింగులో మేము ముగ్గురమున్నూ ఏకగ్రీవంగా భావించి యుంటిమి. మన ఎడిటరుగారు మీటింగు రిపోర్టులో ఈ విషయము మీకు విశదీకరించియే యుందురు.

ఈ సందర్భముగా నా సూచన ఏమనగా, ఈ పుస్తకమునకు "ఒకటవ తరగతి గణిత మహాశాస్త్రము" అని పేరిడినచో క్రొత్తగానూ ఉండగలదు. మా ముగ్గురి ఘనతకు తగినట్లు హుందాగానూ ఉండగలదు. కాన, మీరీ విషయము పరిశీలింప ప్రార్థన.

నా టి.ఎ. బిల్లున్నూ, రెమ్యునరేషనున్నూ త్వరగా పంపగలరు. చిత్తగించవలెను.

☆

సెప్టెంబరు 1970

శ్రీ సుబ్బకవి గారికి,

మీ మనవిని మన్నించి "ఒకటవ తరగతి ఎక్కాల పుస్తకమా?" లేక "గణిత మహాశాస్త్రమా?" అను విషయం చర్చించి నిర్ణయించుటకై ఒక ఉపసంఘం నియమింపబడినది. వారి నిర్ణయం తెలియువరకూ మీ రెమ్యునరేషన్ విషయం పెండింగ్‌లో ఉంచటమైనది. మీ టి.ఎ. బిల్లు ఇందుతో త్రిప్పి పంపటమైనది. మీరు కమిటీ మీటింగుకు హాజరయినట్లుగా ఎడిటర్‌గారి నుండి సర్టిఫికేటును తీసుకుని జతపరచలేదు. ఆ విధంగా జతపరచి పంపగలరు.

☆

నవంబరు 1970

ఘనమైన ఏలినవారికి,

మీరు ఆదేశించిన ప్రకారం ఎడిటరుగారి వద్దనుండి సర్టిఫికేటు తెప్పించి, టి.ఎ. బిల్లుతో జతపరచి పంపుచున్నాను. మా సుబ్బిశెట్టిగారు అసలుకాకుంటే కనీసం వడ్డీ అన్నా చెల్లువేయమని పోరుచున్నారు. ఇప్పటికీ వడ్డీయే పాతిక రూపాయలయినది. మొన్నటికి మొన్న సుబ్బిశెట్టిగారు అరగంటసేపు నిష్ఠూరములాడి అరకిలో ఉప్పు అప్పిచ్చుటకు కూడా నిరాకరించియున్నారు. కాన, దయచేసి నా టి.ఎ. బిల్లు అర్జంటుగా ప్యాసు చేయగలరు.

☆

జనవరి 1971

శ్రీ సుబ్బకవి గారికి,

మీ ఒకటో క్లాస్ 'ఎక్కాల' పుస్తకం కమిటీ మీటింగు బాపతు టి.ఎ. బిల్లు ఇందుతో త్రిప్పి పంపటమైనది. "డి.ఎ. కాలంలో"లో మీరు రెండు పైసలు అధికంగా వ్రాసియున్నారు. మా ఆఫీసులో అది సవరింపబడినది. సవరింపబడినచోట తమరి అమూల్యమైన సంతకంచేసి పంపగలరు.

☆

జనవరి 1971

ఘనమైన ఏలినవారికి,

తమరు ఆదేశించిన ప్రకారం సంతకంచేసి పంపుచున్నాను. రెండు పైసలేగాదు - రెండు రూపాయలు తగ్గించినా నాకు అభ్యంతరంలేదు గాని, మహాప్రభో నా బిల్లు మాత్రం వెంటనే ప్యాసు చేయగలరు.

☆

మార్చి 1971

శ్రీ సుబ్బకవి గారికి,

మీ టి.ఎ. బిల్లు ఇందుతో త్రిప్పి పంపటమైనది. బిల్లు క్రింద మేము ఇంటూ మార్కు పెట్టినచోట "ఈ బిల్లులో పేర్కొనబడిన ఖర్చుల తాలూకూ మొత్తం ఇంతవరకూ నేను ఎవరివద్దా, ఏ డిపార్టుమెంటు నుండి గానీ తీసుకుని ఉండలేదని నా సిరాబుడ్డి సాక్షిగా ప్రమాణము చేయుచున్నాను" అని వ్రాసి, సంతకంచేసి, వెంటనే పంపగలరు. ఈ నెలాఖరులోగానే మీ బిల్లు ప్యాసు చేయబడవలసియున్నది అర్జంటు.

☆

మార్చి 1971

ఘనమైన ఏలినవారికి,

సుబ్బకవి శతకోటి వందనములు. నా టి.ఎ. బిల్లుపై మీరు వ్రాయమనిన విధంగా వ్రాసి సంతకమిడి పంపుచున్నాను. అర్జంటుగా పంప ప్రార్థన. సుబ్బిశెట్టిగారి వడ్డీ ఇప్పటికే నలభై ఎనిమిది రూపాయలయినది. పూజ్యులయిన మా నాయనగారు గుండె జబ్బుతో మంచాన పడి మూలుగుచుండగా ఒక్క బత్తాయిపండునయినా కొనివ్వలేని దుస్థితిలో ఉన్నాను. అనుగ్రహించగలరు.

☆

జూన్ 1971

శ్రీ సుబ్బకవి గారికి,

మీ టి.ఎ. బిల్లు పరిశీలించి ప్యాసు చేయుసరికి మార్చి గడచిపోయి క్రొత్త ఆర్థిక సంవత్సరం వచ్చియుండెను. మీ బిల్లు ఇప్పుడు పే చేయుటకు సిద్ధముగా నున్నది. కానీ క్రొత్త సంవత్సరం బడ్జెట్ ఇంకనూ శాంక్షన్ అయి ఉండలేదు. ఫండ్సు అందగానే మీ మొత్తము మీకు పంపబడగలదు.

మీకొక శుభవార్త. గత సెప్టెంబరులో మీ ఉద్గ్రంథం పేరు నిర్ణయించు నిమిత్తం నియమింపబడిన ఉపసంఘంవారు తిరుపతిలో సమావేశమై మీ సూచనలను చర్చించి, "మన కవుల గౌరవము కాపాడుట మన కర్తవ్యము" అని తేల్చి పుస్తకం పేరు "ఫస్టుక్లాసు లెక్కల

గ్రంథమ్"గా నిర్ణయించి యున్నారు. ఈ గ్రంథముతోపాటు మీ పేరు చిరస్థాయిగా నిలువ గలదు. మీ ఆమోదం తెలుపగోరనైనది.

☆

జూన్ 1971

మహాప్రభో!

ఆ దిక్కుమాలిన గ్రంథానికి లెక్కల గ్రంథం అని పేరెట్టుకున్నా కుక్కల గ్రంథం అని పేరెట్టుకున్నా నా కెలాంటి అభ్యంతరంలేదని గండెజబ్బుతో నేడో, రేపో అన్నట్లున్న పూజ్యులైన మా నాయనగారి సాక్షిగా వ్రాసుకుంటున్నాను. నా పూర్వజన్మ ప్రస్తుత జన్మ పాము లున్నియు క్షమించి నా టి.ఎ. బిల్లును అర్జంటుగా పంప ప్రార్థిస్తున్నాను. శ్రీ సుబ్బిశెట్టిగారి అసలు, వడ్డీ కలిపి ఇప్పటికి అక్షరాలా 116 రూపాయలయినది. నా జన్మలో నాకు ఎవడూ నూట పదహార్లివ్వకున్నా నేనే ఇచ్చుకోవలసి వస్తున్నది. చిత్తగించవలెను. మరియు దయ దలచవలెను.

☆

సెప్టెంబరు 1971

శ్రీ సుబ్బకవి గారికి,

మీ విరచితమైన 'ఫస్ట్‌క్లాస్ లెక్కల గ్రంథమ్' అన్ని పరిశీలనలూ ముగిసి, ఆమోదముద్రలు పొంది అచ్చుకిచ్చుటకు సిద్ధము చేయబడినది. ఇందుతో మీకొక అగ్రిమెంటు ఫారం పంపు చున్నాము. ఈ కాపీరైట్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంటును మొత్తం ఆరు పేజీలూ మూడున్నర రూపాయల స్టాంపు పేపరుమీద అర్జంటుగా టైపుచేయించి సంతకములుచేసి పంపగలరు. తమరి అమూల్యమయిన సంతకముల కొర్రకై మేము ఎదురుచూచుచుండగలము. బడ్జెట్ త్వరలో శాంక్షన్ అయి రానున్నది. త్వరపడగలరు.

☆

సెప్టెంబరు 1971

ఘనమైన ఏలినవారికి,

తమరి జాబు అందుకొని ధన్యుడనైతిని. సరిగ్గా మీ జాబు అందిన రోజే మా నాలుగు నెలల జీతాలు అంది కాస్త ఊపిరి తీసుకొనియుంటిమి. మీ కాగితాలు చూపించి, మరో నాలుగు పంచరత్నాలు రాసిచ్చి, సుబ్బిశెట్టిగారి సగం అప్పునెలాగో వాయిదావేసి, మిగిలిన డబ్బుతో స్టాంపు పేపరుకొని, అయిదు రూపాయలిచ్చి టైపు చేయించి, సంతకంచేసిన అగ్రి మెంటు ఇందుతో పంపుచున్నాను. త్వరలో మీ నుండి వేయిన్నూట పదహార్లు పొంది కష్ట ములనుండి, అప్పులనుండి విముక్తుడనై పూజ్యులైన మా నాయనగారిని బ్రతికించుకోగలనని నమ్ముచున్నాను.

☆

నవంబరు 1971

శ్రీ సుబ్బకవి గారికి,

మీ అగ్రిమెంటును ఇందుతో త్రిప్పి పంపడమైనది. మీ "ఫస్ట్‌క్లాస్ లెక్కల గ్రంథమ్" అచ్చులో పదహారు పేజీలవగలదు. అందువలన మీకు, ఎడిటరుగారికీ, ఆర్టిస్టు గారికి రెమ్యు నరేషన్‌గా తలా నూటపదహార్లు ఇవ్వవలెనని నిర్ణయించనైనది. కనుక వెయ్యిన్నూట పద హార్లు అని ఉన్నచోట నూటపదహార్లు అని సవరించనైనది. అచ్చోట తమ అమూల్య సంత

కమిడి త్రిప్పి పంపగలరు. మీ టి.ఎ. బిల్లు పే చేయుటకు సిద్ధముగా నున్నది. స్టాంపు మీద సంతకంచేసిన రశీదు పంపినచో చెక్కు పంపగము.

☆

నవంబరు 1971

ఘనమైన ఏలినవారికి,

దీనుడు, హీనుడు, నిరాశోపహతుడునగు సుబ్బకవి శతకోటి వందనములు. మహాప్రభో, గడచిన రెండేళ్ల తమ సహవాసముతో శ్రీకృష్ణపరమాత్ముడు బోధించిన గీతారహస్యం నాకు సునాయాసంగా అర్థమయిపోయినది. పూజ్యులయిన మా నాయనగారి గుండెజబ్బు నాకు కూడా సంక్రమించుట నా అదృష్టము. కనీసం సుబ్బిశెట్టిగారి వేధింపులయిననూ తగ్గినవి. వారి యాభై రూపాయలూ వడ్డీతోసహా నేటికి అక్షరాలా నూటయాభై రూపాయలయినది. ధర్మాత్ముడు గనుక చక్రవడ్డీ కట్టుకోలేదు. నేను బ్రతికిపోయితిని.

ఇందులో రెండు తెల్లకాగితములమీద రెవిన్యూ స్టాంపు లంటించి సంతకాలుచేసి పంపుచున్నాను. తమకు తోచినదేదో దానిమీద రాసుకొని నాకు దయచేయించదలచిన మొత్తమేదో నాకు పంప ప్రార్థన.

☆

డిసెంబరు 1971

శ్రీ సుబ్బకవి గారికి,

ఇందుతో మీరు పంపిన రశీదులు త్రిప్పి పంపటమైనది. మీ బిల్లులు ప్యాసయి సిద్ధముగానున్నవి. కాని మీరు రశీదులపై ఒకేస్టాంపు అతికించి సంతకమిడియున్నారు. దయచేసి మరో పదిపైసల బంగ్లాదేశ్ రిలీఫ్ ఫండ్ స్టాంపు కూడా అతికించి వెంటనే పంపగలరు.

☆

జనవరి 1972

ఘనమైన ఏలినవారికి,

"ఫస్ట్‌క్లాస్ లెక్కల గ్రంథమ్" రచయిత సుబ్బకవిగారి కుమారుడు మాస్టర్ సుబ్బకవి వ్రాసుకొను శుభలేఖార్థములు.

ఆర్యా! తాము దయతో పంపిన రెండు చెక్కులున్నూ అందుకొని ధన్యుడనయితిని. అవి అందుటకు రెండు రోజులుముందే పూజ్యులైన మా నాయనగారు హృద్రోగముతో కీర్తిశేషులైనారు. ఆ మరునాడే పూజ్యులైన మాత తాతగారున్నూ వారిని అనుసరించి ఇహలోక బాధలనుండి విముక్తులైనారు.

మా నాయనగారి అంతిమ కోర్కె ప్రకారం శ్రీ సుబ్బిశెట్టిగారి బాకీ తీర్చే అవకాశం నాకు కలగకపోయినా - మీ చెక్కులు సకాలంలోనే అంది, పెద్దల శాస్త్రోక్త దహన క్రియలకు ఇబ్బంది పడకుండా ఆదుకోగలిగినవని తెలుపుటకు సంతసించుచున్నాను. మీకివే ధన్యవాదములు. జైహింద్! జైభారత్!

*(1972)*

☆